# శ్రీ రమణ జ్యోతి
ఆగష్టు 2017
ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi
August 2017
IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.ఎస్. గారి 41వ ప్రవచనము | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | భగవాన్ ఉపదేశసారము | పింగళి సూర్యసుందరం | 9 |
| 3. | తిరువణ్ణామలైక మురుగనార్ రాక | మల్లాది ఫణిమాల | 12 |
| 4. | శ్రీ భగవాన్ పాద సన్నిధిలో | జి. శ్రీహరిరావు | 15 |
| 4. | ఆత్మవిచారణకు సుగమ మార్గము | విడపనకంటి | 18 |
| 5. | సిద్ధులు, వారి 'సిద్ధు'లు | డా॥ వి. రామదాస్ మూర్తి | 22 |
| 6. | Everything Belongs to God | Dr. K. Subrahmanian | 26 |
| 7. | Four Phases | Kunju Swami | 30 |
| 8. | Sannidhi of Sages Like Sri Ramana offers the proof of Advaita Siddh | Kanchi Mahaswamy | 33 |
| 9. | Experience of Deep Sleep Clues for Sadhana | V. Krithivasan | 36 |
| 10. | Maharshi's Concept of Liberation | Dr. M. Hafiz Syed | 40 |


శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరమణకేంద్రం)


**Editorial Board:** Telugu: **Dr. V. Ramadas Murthy, Malladi Phanimala, Katravulapalli Subbalakshmi**
English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# మనస్సును యథాస్థానంలో ఉంచాలి

ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 41వ ప్రవచనము

తెలుగు అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

## సత్సంగము, సద్గ్రంథపఠనము నిరంతరం సాగాలి

మనం మంచి ఆలోచనలను కలిగి వుండాలనుకుంటాము. మంచి విషయాలను ఆలోచించడానికి ప్రయత్నించేటప్పుడు మరేదో శక్తి మనల్ని ఆ దిశలో ప్రోత్సహిస్తుందని మనం గుర్తించాలి. కొద్దిసేపైనా సరే మనం ప్రశాంతంగా వుండగలగాలంటే సదృశ భావనలను కలిగిన సత్పురుషుల సాంగత్యం, సంభాషణల వల్లనే సాధ్యమని గ్రహించాలి. సత్సంగంలో మౌనంగానైనా సరే అలాంటి వారితో గడపడం ముఖ్యం. అందులో క్రొత్త ఏమీ లేదనుకోవడం తప్పు. తెలిసిన విషయాలనే మళ్ళీ మళ్ళీ వినడం వల్ల, అప్పటి అనుభవాన్ని బట్టి వాటిని క్రొత్త తరహాలలో అన్వయించడం జరుగుతుంది. అందుకే భగవాన్ సత్సంగం యొక్క ప్రాముఖ్యతను పలుసార్లు నొక్కి చెప్పేవారు. కాని సత్సంగంలో పాల్గొన డానికి కూడ భగవాన్ కృప అవసరమని గుర్తించాలి.

అలాగే, భగవద్గీత, రామాయణం వంటి సద్గ్రంథములను ఒకసారి పఠిస్తే చాలదా అనుకుంటాము. చాలదు. ఎందుకంటే జ్ఞానులు, అవతార పురుషులు ప్రవచించిన విషయాలను మళ్లీ మళ్ళీ చదివి మననం చేసుకున్న కొద్దీ, వాటిని గురించిన పరిజ్ఞానం పెరుగుతుంది. ఆ గ్రంథాలను చదవడం ఏదో వార్తాపత్రికను చదవడం లాంటిదని భావించరాదు. ఎవరైన ఒక వార్తాపత్రికలోని వార్తలు ఏమిటని అడిగితే, 5-6 వాక్యాలలో విషయాన్ని చెప్పి ముగించవచ్చు. కాని, గొప్ప గ్రంథాల విషయంలో అలాగ కాదు. ఒక శ్లోకాన్ని చదివిన తరువాత మనకు క్రొత్త అర్థాలు అవగతమై, నూతన ఉత్సాహం, ప్రేరేపణ కలుగుతాయి. అప్పటి మానసిక స్థాయిని బట్టి విషయాల పట్ల మన ధోరణి

మారుతుంది. శ్లోకం ఒకటే అయినప్పటికి, భగవంతుడు దానిని వేరే విధాలుగా తోపింప జేస్తాడు. అందుకే మళ్ళీ మళ్లీ చదివిన కొద్ది, మనలో పరిణతి ఏర్పడి అవగాహన పెరుగుతుంది. ఆ మాటకొస్తే, జీవితాంతం అలాంటి గ్రంథాలను చదివినప్పటికి, మనకు అన్ని సంగతులు అర్థమయ్యాయని చెప్పలేము.

మనం ప్రతిరోజు మూడు పూటల కొంచెమించు ఒకే రకమైన ఆహారాన్ని తింటుంటాము. కాని నిన్న ఇవే తిన్నాము కదా అని, ఈ రోజు వాటిని తినమని అనం. శరీర పోషణకు ఆహారం అవసరం. ఏదో అప్పుడప్పుడు మిఠాయిలు లేదా ఇతర పిండివంటలు తినినప్పటికి వాటిని రోజూ తినము. అవి మన శరీరానికి పోషణలను అందించలేవు. అలాగే విటమిన్ల వంటివి అదనంగా తీసుకున్నప్పటికి కేవలం వాటి ఆధారంగా మాత్రమే జీవించలేము. అప్పుడూ మామూలు భోజనం చేయాల్సిందే. మనం మామూలు అనుకునేదే మన శరీరాన్ని పోషించ గలదు. ఇక వారానికొకసారి భోజనం చేద్దామా అంటే అదీ కుదరదు. భౌతిక స్థాయిలోనే పరిస్థితి ఇలా వుంటే, మనసు విషయం మరెంత ప్రాముఖ్యమైనదో ఆలోచించాలి. ఆహారం మన శరీర పోషణ జరిపితే, భగవద్గీత, మరే ఇతర పవిత్ర గ్రంథమో మన మనసును ఆరోగ్యంగా సరియైన దిశలో వుంచుతుంది. దాని వల్ల ఆనందంగా వుండడానికి మనమనుకునే వాటికి భిన్నంగా మరెన్నో మార్గాలున్నాయని బోధ పడుతుంది. ఎప్పుడూ స్వంత విషయాలు, కుటుంబం, పిల్లల సంగతికి పరిమితం కాకుండ విశాల దృక్పథంతో ఆలోచించితే ఆనందంగా వుండగలుగుతాం.

### నామ, రూపాలు అనేకం, శక్తి మాత్రం ఒక్కటే!

రోజూ ప్రార్థన, పూజ, జపం, ధ్యానం ఇలాంటివి చేస్తుంటాము. మన మనసును ప్రశాంతంగా వుంచి సమస్యలను అలజడి లేకుండ

ఎదుర్కొన జేయగల శక్తి కోసం ఇవి చేస్తాము. ఆ విషయంలో ప్రతిసారి విజయవంతం కాకపోవచ్చు. కాని నెమ్మదైన మనసు సమస్యలను ఎదుర్కొనే శక్తినిచ్చి, విజయం పొందామా లేదా అని వ్యథ చెందనివ్వదు. ఒకవేళ విజయం సాధించినప్పటికి, గర్వపడం. ఒక ఉన్నత శక్తి మనకు ఆ బలాన్ని ఇస్తుంది. మనం ప్రతిరోజూ దానిని సాధించేది ఎలా? కొందరు వేదాంతం గురించి, ఇతర గొప్ప విషయాలను గురించి మాట్లాడతారు. కొందరు ఏసుక్రీస్తు గురించి, కొందరు రమణ మహర్షి గురించి ఇలాగే బాబా, శ్రీ అరోబిందో గురించి తలుస్తుంటారు. ఈ ప్రత్యక్ష అవతారాలకు మనం విన్నవించుకునేవి నిజంగా వినిపిస్తాయా? ప్రతి ఒక్కరు, ఏదో ఒక గురువును ఎంచుకుంటే వాళ్ళకందరికి ప్రతి ఒక్కరి ప్రార్థనలు వినిపిస్తాయా? సహజంగా ఈ అనుమానం వస్తుంది.

ఒకరికి తల్లిదండ్రులు ఇచ్చిన పేరు కృష్ణస్వామి అనుకుందాం. ఆ వ్యక్తి పేరు జనన ధృవీకరణ పత్రంలో అలాగే వుండవచ్చు. ఆఫీసులో అతనిని అలాగే పిలుస్తారు. కాని ఇంటి దగ్గర మాటేమిటి? తల్లిదండ్రులు 'కిట్టూ' అని పిలువవచ్చు. ఇతరులు 'స్వామి' అని, 'కృష్ణ' అని లేదా స్నేహితులు మరేదో ముద్దుపేరుతో పిలవచ్చు. పిల్లలు జన్మించిన తరువాత, వాళ్ళు, వాళ్ళ పిల్లలు 'నాన్న', 'తాత' ఇలాగ పిలుస్తూ వుంటారు. పేర్లు అనేకం, వ్యక్తి ఒకరే. అలాంటి పరిస్థితుల్లో ఎవరైన పిలిచినప్పుడు, నేను ఆ వ్యక్తియేనా అని సమయం తీసుకుని ఆలోచిస్తామా? లేదా, కాసేపు ఆగు, కాస్సేపటి క్రితం ఎవరో నన్ను 'నాన్నా' అన్నారు. కొంచం సర్దుకోనివ్వండి అంటారా? ఏ ప్రయత్నమూ, ఆలోచన లేకుండ వెంటనే పలుకుతాం. రెండవది, ఒక వ్యక్తిని పిలిచి 'నీవు ఎవరు?' అని అడిగితే జవాబు ఏమి ఇస్తారు? మన పేరు చెబుతాం. పుట్టినప్పుడు మనకు పేరు లేదని అందరికి తెలుసు. పేరు పెట్టిన తరువాత సౌకర్యం కోసం ఆ పేరును ఆ శరీరానికి జత చేస్తారు. ఇక వ్యక్తి చనిపోయిన వెంటనే అతని పేరు చెప్పి, తీసుకెళ్ళిపొండి

అనరు. శవాన్ని తీసుకెళ్ళి పొండి అంటారు. ఆ తరువాతి రోజుల్లో ఆ పేరును వాడుతారు.

మనం 'లలితా సహస్రనామం' ఎంతో శ్రద్ధతో పారాయణం చేస్తాము. అమ్మవారు అంబ యొక్క వెయ్యి పేర్లు చదువుతాము. ఆఖరుకు ఆమెను 'నామ రూప వర్జితా' అని ధ్యానిస్తాం. అంటే ఆమెకు నామ, రూపాలు లేవని అర్థం. అన్ని పేర్ల చివర ఆమెను పేరు, ఒక ఆకారం లేని దేవిగా అభివర్ణిస్తాం. మానవుల మనసుకు నామం, రూపం, లేకుండ ఆమెను తలచుకొనడం కష్టం. ఋషులు అందుకే ఈ పద్ధతిని సూచించారు. నిరాకార స్వభావం వున్న మాతను మనం ఊహించలేము గనుక ప్రాథమిక దశలో ఒక రూపాన్ని ధ్యానించి పురోగమిస్తాం.

**మనసును యథాస్థానంలో ఉంచాలి**

ప్రస్తుతం మీద ధ్యాసను కేంద్రీకరించడం కష్టమని అనుభవాన్ని బట్టి మనకు తెలుస్తుంది. మన శక్తిలో చాలా భాగం గతం, లేదా భవిష్యత్తు గురించిన ఆలోచనలతో నిండిపోతుంది. మన శ్రద్ధ మొత్తం ఇప్పుడు జరుగుతున్న దాని మీద కేంద్రీకరించాలి. అది భగవంతుని అనుగ్రహం ఉన్నప్పుడే వీలవుతుంది. రోజులో ఏమి జరిగినప్పటికి, ప్రతి ఒక్కటి ఆయన ఇచ్ఛవల్ల జరుగుతుందని నమ్ముతూ ప్రార్థన చేయాలి. పూజ, జపం, ధ్యానం చేస్తున్నప్పుడు మనం భగవంతుని తలచుకుంటాం. ఏకధాటిగా ఒక్క పది నిమిషాలు ఏకాగ్రతతో అలా మనసును నిలుపగలిగితే, ఆ వ్యవధిని క్రమంగా పెంచుకొనవచ్చు. అంతా దైవేచ్ఛగా భావిస్తే ఏకాగ్రత, నిర్భయత్వం పెరుగుతాయి. ఏ కార్యం చేసినప్పటికి, దాని ఫలితాన్ని ఆశించకుండ చేయాలి. ఇది అనుభవంతో వస్తుంది కాని, చర్చిస్తూ వుంటే లభించదు. అలాంటి ప్రవర్తన వల్ల అప్రయత్నంగా అసాధారణమైన శక్తి కలిగి రోజువారీ

సమస్యలను ఎదుర్కొనగలుగుతాం. అది ధ్యానం యొక్క అద్భుత శక్తి, ప్రయోజనం.

ఆ స్థితిని సాధించడం ఎలా? అంచెలంచెలుగా ప్రయత్నం చేయాలి. గాఢనిద్రలో వున్నప్పుడు శరీరం, మనసు గుర్తుకు రావు. క్రమంగా మనసు హృదయం నుండి బయట పడుతున్నప్పుడు మనసు తెరమీదికి వస్తుంది. ఆ సమయంలో పక్కమీద నుండి దిగకుండ, ధ్యానం లేదా మానసికంగా ఏదైన జపం చేయాలి. ఐదు, పది నిమిషాలు ప్రాపంచిక వ్యాపారాలను పట్టించుకోకుండ వుండాలి. అలా ప్రయత్న పూర్వకంగా చేసినప్పుడు మనసు నిశ్చలమవుతుంది. ప్రొద్దుటే అలా చేస్తే కొంతసేపు ప్రశాంతతను అనుభవిస్తారు. దానితో నిత్య కార్యక్రమాలు సాఫీగా జరుగుతాయి. పగటిపూట మనసు ఏదో ఒక ఆలోచనలో నిమగ్నమైనందువల్ల మెలకువగా వున్నప్పుడు సుఖంగా వుండము. కాని మనం కునుకు తీస్తే, తాజాగా అవుతాము. ఎందుకంటే అప్పుడు మనసు వుండి వుండదు. నిద్ర పోకుండ పరుపు మీద 8 గంటలు పడుకుని వున్నప్పటికి, మనకు విశ్రాంతి లభించదు. మనసు హృదయంలో లీనమైనప్పుడే ప్రశాంతత లభిస్తుంది. అంటే మనసులేని ఆ స్థితిలో ఆనందం అనుభవిస్తున్నవారు మరెవరో వున్నారు. జాగృతి (మెలకువ), స్వప్న స్థితి, స్వప్నావస్థకాని (సుషుప్తి) స్థితి, అన్నింటిలో ఏదో ఒకటి అంతటిని గమనిస్తూనే వుంది. అలా నిరంతరం గమనించేదే ఆత్మ.

## కర్తృత్వ భావన వదలి పెట్టాలి

మూడు స్థితులను (జాగృత్, స్వప్న, సుషుప్తి) మించి, ఆ పైన తురీయ స్థితి వుంది. దానిని ప్రయత్నపూర్వకంగా సాధిస్తే, రోజంతట ప్రశాంతంగా వుండవచ్చు. అది అనుభవంతో సాధించగలిగినది. ఇతరులకు మాత్రం అలాంటి వ్యక్తి ఏదో ఒక పని చేస్తున్నట్లు కనిపిస్తారు.

కాని అతనికి అలా చేస్తున్నట్లు అనిపించదు. అంటే కర్తృత్వ భావన వుండదు. మీ విధులు మీరు నిర్వర్తించాలి, మీ శక్తికొలది నిర్వస్తున్నారు. అంతే. భగవాన్ రోజులో ఎన్నో పనులు చేసేవారు. కాని అందులో కర్తృత్వ భావన వుండేది కాదు. కర్మఫలాలను అప్పగించడం అంటే అదే. ఒక కర్మను తాను చేస్తున్నాను అన్న భావన లేనప్పుడు ఆనందమూ వుండదు, దుఃఖమూ వుండదు. కొళాయిలో నుండి నీళ్ళు ప్రవహిస్తాయి. నీళ్ళు వున్నప్పుడు కొళాయికి సంతోషంగాని, నీళ్ళు లేనప్పుడు దుఃఖం గాని కలుగదు. తన ద్వారా నీటిని పోనిస్తుంది. అంతే.

ఏ పనినిగాని ఏదో ప్రీతితో, దానిలో మమేకమైనట్లు గాకుండ, తాము చేస్తున్నామన్న భావన లేకుండ చేయాలని భగవాన్ అంటారు. ఆ భావన కలుగడానికి పెద్దపెద్ద పనులేమీ చేయనక్కర లేదు. లేచిన వెంటనే మనసును లోనికి పంపే ప్రక్రియను పాటిస్తే చాలు. అలా చేయడం కాలాన్ని వృథా చేస్తున్నట్లుగా భావించరాదు. ఎంతో సమయం, శక్తి కలిసివస్తుంది. ఎందుకంటే పని సామర్థ్యత పెరుగుతుంది. అందరిలాగే నడుచుకుంటున్నప్పటికి, కార్యం పట్ల వ్యక్తి తీరు, ఆలోచనా పద్ధతి మారుతాయి. నేను కర్తను అన్న భావన వుండదు. కార్యం యొక్క ఫలం భగవంతుడే ఇస్తాడు. పని చేయడమే మన వంతు. ఉదయాన్నే మొట్టమొదట ఇలా చేస్తే, భగవాన్ కృపతో ప్రతి ఒక్కటి దైవేచ్ఛతో జరుగుతుందనే మానసిక స్థితిని పొందుతాం.

అరుణాచలశివ

# భగవాన్ ఉపదేశసారము - గణపతి ముని వ్యాఖ్యానము

- పింగళి సూర్యసుందరం

18వ శ్లోకం: వృత్తయస్త్వహం వృత్తి మాశ్రితాః ।

వృత్తయో మనో విద్ధ్యహం మనః ॥

అర్థం: మనస్సు యొక్క కార్యకలాపాలన్నీ "నేను" మీదే ఆధారపడి ఉంటాయి.

వ్యాఖ్యానం: 'నేను' అనే భావం మీదే అన్ని మానసిక కార్య కలాపాలూ ఆధారపడి ఉంటాయి. అదే వాటి నిజస్థితి. దైనందిన జీవితంలో ఈ మానసిక కార్యకలాపాలు విస్తరించి కార్యరూపంలో వ్యక్తమవుతాయి. ఇదే మనస్సంటే. అందువల్ల మనస్సంటే "నేను" అని గ్రహించు. అన్ని కార్యాలూ ఆ "నేను" మీదే ఆధారపడి ఉంటాయి కాబట్టి మనస్సుకి రూపమదే. ఇంకొక విధంగా చెప్పాలంటే, "నేను" అనేదే మనస్సు యొక్క రూపం.

19వ శ్లోకం: అహ మయం కుతో భవతి చిన్వతః ।

అయి పత త్యహం నిజవిచారణం ॥

అర్థం: ఈ "నేను" ఎక్కడ్నుంచి ఉదయిస్తోంది? దీనిని అన్వేషించే వానికి 'అహం' భావం పడిపోతుంది. ఇదే ఆత్మ విచారణ అంటే.

వ్యాఖ్యానం: ఈ "నేను" అనేదే అహంభావం. ఈ 'నేను' అనేది ఎక్కడ్నుంచి వస్తుంది? ఈ అన్వేషణ చేసే వానికి 'నేను' అనే అహంభావం పడిపోతుంది, నశించిపోతుంది. ఇదే ఆత్మవిచారణ అంటే.

20వ శ్లోకం: అహమి నాశభా జ్యహ మహం తయా ।

స్ఫురతి హృత్స్వయం పరమ పూర్ణసత్ ॥

అర్థం: అహంభావం నశించినప్పుడు పరమమైన కేవల ఉనికే హృదయంగా 'అహం అహం' అంటూ స్ఫురిస్తుంది.

వ్యాఖ్యానం: మనో వ్యాపకాలకన్నిటికీ మూలం అహంభావమే. అది నశించినప్పుడు ''నేను నేను'' అనే ఎరుక హృదయంలో స్ఫురిస్తుంది. నేను సమసిపోయినప్పుడు వేరొక ''నేను'' స్ఫురించుట మేమిటి? దీని భావమిది. అహంభావం వ్యక్తిత్వభావానికి భిన్నం కాదు. అది రెండు విధాలు - ఒకటి మనస్సుకి సంబంధించినది, రెండవది ఆత్మకి సంబంధించినది. మనస్సుకైతే 'నేను' అనే భావముంటుంది, ఆత్మకు అది ఉండదు. మనస్సు కల్పించే 'నేను' అనే భావం పోతే ఆత్మ భాసిస్తుంది. అందువల్లే ఒక 'నేను' నశిస్తే రెండవది తెలియ వస్తుంది.

21వ శ్లోకం: ఇద మహం పదాఽ భిఖ్య, మన్వహమ్ ।
అహమి లీనకే ఽ ప్యలయ సత్తయా ॥

అర్థం: హృదయం పేరు 'నేను'. మనస్సు కల్పించే 'నేను' నశించినా, అది మాత్రం సమసిపోదు.

వ్యాఖ్యానం: హృదయానికి పేరు 'నేను'. దీని నుంచి మనస్సులో జనించేదే 'నేను' అనే భావం, దానికి మూలం హృదయంలోని ఆత్మే. ప్రతిరోజూ మానసికమైన 'నేను' నశించినా, ఆత్మగా 'నేను' అట్లాగే ఉంటుంది. అది నశించదు. సామాన్యునికి కూడ 'నేను' అంటే ఏమిటో తెలుసు. అతనికి కూడ 'నేను' అంటే ఆత్మేనని తెలుసు. 'నేను' అనే భావం లిప్తమైనా ఆత్మ మాత్రం అట్లాగే ఉంటుంది. మనస్సు మాత్రమే తగ్గి ఉంటుంది. ఈ విధంగా చూచినప్పుడు మనస్సనేది ఆత్మ నుండి జనించేదే గాని వేరు కాదని తెలుస్తుంది. మనస్సుకి అహంభావ ముంటుంది అందువల్ల అది జన్యమైనదే. ఆత్మలో 'నేను' ఉనికిగా

ఎప్పుడూ ఉంటుంది. అందువల్ల అదే ప్రాథమికం.

22వ శ్లోకం: విగ్రహేంద్రియ ప్రాణధీతమః ।

నాహ మేక సత్ త జ్జడం హ్యసత్ ॥

అర్థం: ఉన్న సత్యమల్లా 'నేను' ఒక్కటే; అదే దేహానికి, ఇంద్రియాలకీ, శ్వాసకీ, ఆలోచనకీ భిన్నం. ఇవన్నీ అవిద్యే. ఇవన్నీ జడం, అవేవీ లేనట్టే (అసత్తే).

వ్యాఖ్యానం: ఆత్మ కేవల స్థితి. దేహాదులకి గల అవిద్యాంధకారం కాదు. దీనికి కారణమిది. దేహాదులన్ని జడం. వాటికి అస్తిత్వం లేదు. అటువంటప్పుడు, అవి ఆత్మ ఎట్లా అవుతాయి? అస్తిత్వమే ఆత్మ లక్షణం.

23వ శ్లోకం: సత్వ భాసికా చిత్క్వ వేతరా? ।

సత్తయా హి చిత్, చిత్తయా హ్యహం ॥

అర్థం: కేవల ఉనికిని తెలియజేయడానికి వేరే చైతన్యమెక్కడ్నుంచి వస్తుంది. ఉనికి వల్లనే చైతన్యం వస్తుంది, చైతన్యం వల్లనే ఆత్మ తెలుస్తుంది.

వ్యాఖ్యానం: 'ఉనికి ఉన్నట్లు ఎట్లా తెలుస్తుంది?' అనే సందేహాన్ని ఇక్కడ రూపుమాపుతున్నారు. ''ఉనికి''ని తెలియచేయటానికి వేరే చైతన్య మెక్కడ ఉంటుంది? ఉండదు. ఉనికిని తెలియచేయటానికి వేరే చైతన్యమవసరం లేదు. ఉనికి వల్లనే చైతన్యం తెలుస్తుంది. కేవల ఉనికి చైతన్య నిలయం. ''నేను'' అనేది కూడ చైతన్యం వల్లనే ఉదయిస్తుంది. అంటే చైతన్యమే ''నేను'' అన్న మాట. ఉనికి, చైతన్యం, అహం - అన్నీ ఒక దానినే సూచిస్తాయి. మనస్సు కల్పించే అహంభావం కూడా చైతన్యజన్యమే అని ఇదివరకే చెప్పుకున్నాం.

# తిరువణ్ణామలైకి మురుగనార్ రాక

మల్లాది ఫణిమాల

శ్రీ మురుగనారు గురువారము, 1923 సెప్టెంబరు 21న తిరువణ్ణా మలై వచ్చిరి. ఆయన పాదములు తిరువణ్ణామలై యొక్క నేలను తాకగానే ఆయన తన యొక్క వ్యక్తిత్వమును కోల్పోయిరి. ఆయన ఆలయమునకు వెళ్ళి ముందుగా అరుణాచలేశ్వరుని మరియు ఉణ్ణాములైయమ్మను దర్శించుకొనిరి. అప్పుడు ఆయన రమణాశ్రమ మునకు వెళ్ళదలచిరి. శ్రీ మురుగనారు, భగవానునకు అర్పించుటకు తన వద్ద ఏమియులేదని గ్రహించి, ఆలయమునందే కూర్చుని, 'రమణ దేశిక పతికము' అనెడి పది పద్యములను రమణులను కీర్తిస్తూ వ్రాసిరి. మురుగనారు ఆశ్రమమునకు చేరుసరికి, భగవాన్ కొండపైకి వెళ్ళుటకు సిద్ధముగా నుండిరి. భగవానును చూసిన క్షణమందే మురుగనారు తనను తాను కోల్పోయిన స్థితికి వెళ్ళిరి. కొంతసేపటికి ఆయన సహజ స్థితిలో "రమణ దేశిక పతికము"ను చదువుట ప్రారంభించిరి. పద్యములు చదువుచుండగా, మాటలు తడబడి, కన్నుల నీరు ప్రవాహము కాగా, ముందుకు సాగలేని మురుగనార్ స్థితిని భగవాన్ గ్రహించి, వారి చేతి నుండి కాగితములు తీసుకుని, తామే స్వయంగా చదువుట ప్రారంభించిరి. భగవాన్ మురుగనారును, "మీరు మాణిక్య వాచకర్ లాగ పాడగలరా?" అని అడుగగా, అప్పుడు మురుగనారు, "పూర్వము ఒకసారి మీరు కైలాసపర్వతము నుండి, మాణిక్య వాచకర్ పాటలను వినుటకు "తిరుపెరుందురై"కి వచ్చితిరి. అట్లే శివరమణా, ఇప్పుడు మీరు నా పాటలను వినుటకు తిరువణ్ణామలై వచ్చితిరి" అని తన పద్యములో చదివెను.

రెండుమూడు రోజులు తిరువణ్ణామలైలో ఉన్నప్పుడు, మురుగనార్ తన యొక్క అంతరంగమునందు జరుగు మార్పులను గమనించిరి. ఆయనకు ఆ నూతన అనుభూతిని ఎట్లు అన్వయించు కోవలెనో తెలియకుండెను. ఈ నూతనోత్సాహమును ఇంతకు ముందు, ఆయన ఎప్పుడు పొందలేదు. మురగనార్ చాలా సమయమును, తన మనస్సును భగవాన్ యందే నిల్పుటకు ప్రయత్నించుచూ, భగవాన్ సన్నిధిలోనే గడిపేవారు.

ఒక సందర్భమునందు, భగవాన్ పరిసరములు తేజోవంతమైన కాంతితో నిండియుండుటను గమనించిరి. ఆ కాంతి రోజంతయు ఉండెను. ఆ సమయమునందు కుంజుస్వామి, దండపాణిస్వామి, మరియు అరుణాచలస్వామి భగవాన్ చెంతనే ఉండిరి. మురుగనార్‌కు ఒక్కసారిగా ప్రపంచమంతయు దాని పట్టు కోల్పోతున్నట్లును, తాను తన యొక్క ఉనికిని కోల్పోయే పెద్ద ప్రమాదమున్నట్లును అనుకొనిరి.

ఆయన భావముల ఉద్వేగము ఆయనను భయపెట్టినది. తనపై ఆధారపడియున్న తన తల్లిపట్ల మురుగనార్ చాలా బాధ్యతతో నుండిరి. తనకు కలిగిన కొత్త అనుభూతులందు చిక్కుకొని, తన తల్లిని శ్రద్ధగా చూడలేననియు, అందుచేత ఆమె చాలా కష్టపడవలసి వచ్చు ననియు తలచిరి. ఈ తలపులు కలిగినంతనే మురుగనార్ లేచి, ''భగవాన్ తన వద్దకు వచ్చినవారందరినీ మాయచేసి, వారిని తమ యందు కలుపుకొనుటయే లక్ష్యముగానున్నారు. నా తల్లికి సంరక్షకు లెవరూ లేరు. అందుచేత నన్ను ఒంటరిగా వదలండి. నాకు ఇక్కడ నుంచి వెళ్ళిపోవలెనని ఉంది. నన్ను వెళ్ళనివ్వండి'' అనుచూ బయటకు వెళ్ళిరి.

మురుగనార్ వెళ్ళినంతనే, భగవాన్ అరుణాచలస్వామిని మరియు కుంజుస్వామిని, ఆయన వెంట వెళ్ళమని సంకేతమిచ్చిరి. వారు ముగ్గురు అగ్నితీర్థము వరకు వెళ్ళిరి. వెన్నెల ఎంతో బావున్నందున, వారికి కాసేపు అక్కడ చెరువుగట్టుపై కూర్చోవాలనిపించెను. భయపడుటకు ఏమీ లేదనియు, భగవాన్ యొక్క ప్రభావమును శంకింపనవసరం లేదనియు, కుంజుస్వామి మురుగనార్‌కు తెలియ చేయుటకు ప్రయత్నించిరి. కాని, మురుగనార్‌కు పూర్తి నమ్మకము కలుగక, చెంగమ్‌రోడ్డునందు చంచలముగా అటు ఇటు తిరుగు చుండిరి. మురుగనార్ తిరిగి ఆశ్రమమునకు తమకు తాముగా ఉదయం 3 గంటలకు తిరిగి వచ్చెను. మరొక రెండు, మూడు రోజులు ఆశ్రమములో ఉండి, మురుగనార్ చెన్నై చేరిరి.

ఈ విధంగా మురుగనార్ మొదటిసారి భగవాన్‌ను దర్శించుట జరిగినది. భగవాన్‌తో కలసి, ఆయనను నీడలాగ అనుసరించుటకు, భగవాన్ యొక్క పరిఛాయగా పేరొందుటకు మురుగనార్‌కు అది ప్రారంభము మాత్రమే.

- **ద్వంద్వములు, త్రిపుటములు ఇవి యెప్పుడును ఒక దాని నాశ్రయించి యుండునవి, అది యెదియని వెదకి మనస్సులోఁజూడఁగ నవి వీడును; చూచినవారే తత్త్వమును జూచినవారు, కలఁత నొందనివారు.**

**- ఉన్నది నలుబది-సద్విద్య**

# శ్రీ భగవాన్ పాద సన్నిధిలో (At the feet of Bhagavan)

ఆంగ్లమూలం: టి.కె. సుందరేశ అయ్యర్
(గత సంచిక తరువాయి) తెలుగు అనువాదం: జి. శ్రీహరిరావు

## ఉపదేశసారము

ఒకసారి శ్రీ భగవాన్‌తో సంభాషించు సందర్భములో, జీవిత కాలము వారితో గడిపి నేర్చుకున్నదీ, ఇతరులతో అనేక పర్యాయములు చర్చించి, సంభాషించి గ్రహించినదీ, శ్రీ భగవాన్ రచనల అధ్యయనంతో పుణికిపుచ్చుకున్న ఉపదేశ సారాంశమూ ఒక్క మాటతో తెలియ పరచ వచ్చునని అంటూ శ్రీ భగవాన్ అనుజ్ఞతో నేను యిలా ముగించాను: ''శ్రీ భగవాన్ ఉపదేశసారమంతా యిదే: ఉన్నది వారొక్కరే! మిగిలిన దంతయూ దృశ్యమానమే కాని సత్యము కాదు''.

శ్రీ భగవాన్ ఒక చిరునవ్వు నవ్వారు.

''అంతే, అంతే, అంతే'' అంటూ అక్కడి నుండి వెళ్ళిపోయారు.

వారి బోధనలనుండి నేను పునరుద్ఘాటించవలసినది: 'తురీయ స్థితి మాత్రమే సత్యము. మిగిలిన మూడు స్థితులూ సత్యదూరములు'.

## గురూపదేశమేమిటి?

మనం గురువు దగ్గరకు యెప్పుడు వెడతాము? మనస్సు అశాంతితో కొట్టుమిట్టాడుతున్నప్పుడు, మనమేమీ సాధించలేదనే అసంతృప్తితో బాధ పడుతున్నప్పుడు, గురువుని ఆశ్రయిస్తాము. వారు మనపై తమ కరుణాపూరిత దృష్టిని సారిస్తారు. ఆ దృష్టిలోనే గురుకృప అంతా ఇమిడి యున్నది. వారి సన్నిధిలో శాంతి నెలకొని వుంటుంది. గురువులో నీ సంపూర్ణ భద్రతను అనుభవిస్తావు. నీకు తగిలిన దెబ్బలనన్నిటిని ''గురు స్పర్శ మటుమాయం చేస్తుంది. వారిలో నీవు కరిగి పోయి అదృశ్యమై

పోయిన అభిన్నత్వ అనుభవం కలుగుతుంది. నీకు నిశ్చలభావం కలుగుతుంది. గురువాణి, ''అచంచల స్థితిని చేరుకొని, నేనే పరమాత్మను అను సత్యాన్ని గ్రహించుకో'' అని బోధిస్తుంది. ఈ జ్ఞానమే జీవిత సత్యాలను తెలియబరుస్తుంది. పూర్ణమైన, సాపేక్షమైన జీవితపు విలువలు, ఈ ఎఱుక వల్ల విశదమగును.

తెలుసుకోవలసినది, అర్థము చేసుకోవలసినది యేమిటి? శాశ్వతము, ఎట్టి మార్పులూ చెందని ఆత్మ స్వరూపమును అనుభవైక్యము చేసుకొనుటయే జీవిత లక్ష్యము. అనంతము, శాశ్వతమూ అయిన యీ సత్యపు నేపథ్యములో అశాశ్వతమూ, పరిమితమూ అయిన మన కర్తృత్వ భావనలు మెదులుతూ గ్రహణశక్తికి తెర వేస్తూ వుంటాయి. మన ఆత్మ స్వరూపాన్ని మరుగు పరుస్తూ వుంటాయి.

ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, శ్రీ భగవాన్ వాక్కులలో, ''నీవే ఆత్మవు''. మన వునికికి మూలము అనంతమూ, మార్పు లేనిదీ అయిన ఆత్మ అనునది. ఈ ఆత్మస్థితి పరిశుద్ధమయినది. నిజ స్వరూపము గురించి నిరంతర స్పృహ కలిగినది. పవిత్రమయిన, నిష్కళంకమయిన ఆనందస్థితి. బాహ్య వస్తువుల వల్ల కాని, బాహ్య పరిణామాల వల్ల కాని, చలించని స్థితి అది. అదే నీ నిజమయిన స్వభావము అని గ్రహించు. ఆ స్థితిలో ఉపవిష్టుడగుట నీ గమ్యము. ఆ గమ్యము చేరినప్పుడు సుఖము, దుఃఖము, సంతోషము, బాధ... యివేవీ నిన్ను స్పృశించవు. ఇవేవీ ఆత్మను చలింపచేయలేవు.

నీ స్థితిపై యెటువంటి నీడలూ పడకూడదు. ఎటువంటి కర్తృత్వ భావము, బాధ, లౌకికానందము, ఆ నిజస్థితిలో నిన్ను తాకలేవు. ఆ ప్రజ్ఞ పొందినప్పుడు నీవు నిరంతర తన్మయానందములో మునిగిపోయి

వుంటావు. ఆ స్థితి పటిష్టమయినప్పుడు పొందే శాంతి శాశ్వతము, అభేద్యము. ఉపనిషత్తులు, శ్రీ భగవాన్, బోధించిన సత్యమిదే!

నీలోని నిశ్చలము, స్థిమితమయిన భాగము గురించి, నిరంతరము మార్పు చెందు చంచలమయిన భాగము గురించి కూడా చెప్పబడినది. ఆ చంచలమయిన భాగమే నీ మనస్సు. ఈ మనస్సే నీ మాటలకు, చేష్టలకు, కారణభూతము. వాటి వల్ల కలుగు సుఖ దుఃఖాలకు, నీలో ఉత్పన్నమగు భావోద్రేకాలకు, అన్నిటికీ యీ మనస్సే కారణము. దేహముతో తానైక్యమై, ఆ దేహమును అనేక కార్యకలాపములకు ప్రేరేపించి, వాటి వల్ల కలుగు ఆనందమునకు గానీ, ఆవేదనకు గానీ గురి చేయు వస్తువే మనస్సు. మనస్సుకు మూలమయిన రాజసిక, తామసిక గుణములే దాని చేష్టలకు కారణభూతములు.

ఈ మానసిక గుణముల వల్లనే మనస్సు స్థూల దేహముతో ఐక్యమై పోవటమే కాక, నీ నిజ స్థితిని, నీ ఆత్మను ఒక తెరవలె మరుగు పరిచి దాచివేయుచున్నది.

అయితే, యీ మనస్సుకు ఒక సుగుణమున్నది. దానిలో రాజసిక తామసిక నైజములే కాక సాత్విక గుణము కూడా ఇమిడి యున్నది. ఈ సాత్విక గుణము వల్ల ప్రశాంతత, సమన్వయశక్తి లభ్యమవు తున్నవి. తాము చేయు కార్యకలాపములన్నియు భగవదర్పితములు కావించి, విజ్ఞులు సాత్విక గుణమును పెంపొందించుకొనుచున్నారు. శ్రీ మద్భాగవత పఠనము వల్ల యీ సాత్విక గుణమును వృద్ధి చేసుకో గలరు. ఈ ప్రయత్నము వలన, తామసిక, రాజసిక ప్రవృత్తులను తొలుత నిగ్రహించుకొని, క్రమముగా వాటిని పూర్తిగా నిర్మూలించుకొను శక్తి సంపాదించుకొనవలెను. (సశేషం)

# ఆత్మ విచారణకు సుగమ మార్గం

ఆంగ్ల మూలం: నండూరి రామమోహన్

తెలుగు అనువాదం: విడపనకంటి

'నేనెవరు' అన్న అన్వేషణను 'విచారణ' అని కూడ పిలుస్తారు. టూకీగా చెప్పాలంటే, అది 'నేను-ధ్యాస' నుండి ఉదయించే ఆలోచనల మూలాన్ని - ఆత్మను - వెదకడమూ అందులో లీనం కావడమూనే. కాని "మూలాన్ని వెదుకు" అన్న గొప్ప సూచన ఒక్క ఆత్మ విచారణకే కాకుండా, ఇతర మార్గాలు - విచారణ, జపం, మంత్రం, ప్రాణాయామాలకు కూడ అన్వయించదగిన ప్రక్రియ.

ఆత్మ అన్నింటికి మూలం. అహం లేదా 'నేను-ధ్యాస' (చిత్ శక్తి), శ్వాస (క్రియా శక్తి) ఒకే మూలము - ఆత్మ - నుండి పుట్టి అందులోనే అంతమవుతాయి. అలా విస్తృతమైన భావనతో గమనించినప్పుడు ఆత్మ శోధన "నేను ఎవరు" అన్న ప్రశ్నకు మాత్రమే పరిమితం కాదు. దీనిని గురించి భగవాన్ ఈ క్రింది మాటల్లో విశదపరిచారు:

"ఏది వున్నదో అది ఒకటే యథార్థ వస్తువు. దానిని ఒక స్వరూపం, ఒక జపం, మంత్రం, విచారణ లేదా మరే యితర మార్గం ద్వారా గాని తెలియజేయవచ్చు. అవన్నీ కూడా ఆఖరుకు ఒక ఏకైక వాస్తవముగా ఏకీకరణ చెందుతాయి. భక్తి, విచారణ, జపం అన్నవి అవాస్తవాలను వేరు చేయడానికి మనం చేసే వివిధ ప్రయత్నాలు మాత్రమే. (టాక్స్-401)

ఆత్మశోధన (అన్వేషణ) తప్ప తక్కిన అన్ని మార్గాలు మనసును ఉపయోగించుకొంటాయని భగవాన్ తెలిపారు. ఆత్మశోధన మాత్రం మనసు యొక్క ఉనికినే ప్రశ్నిస్తుంది. సాంప్రదాయిక అవగాహనలో

జపం, మంత్రం మొదలైనవి మనసు యొక్క ఏకాగ్రతకు తోడ్పడ తాయన్న భావన వుంది. ఆత్మసాక్షాత్కారానికి అవి సహాయకారిగా వుంటాయన్న అభిప్రాయమూ వుంది. అలాంటి పరిమిత దృక్పథనం నుండి బయటపడి ఆ సాధనాలనే ఉపయోగించి ఆత్మాన్వేషణ అన్న ప్రక్రియను విస్తృతం చేయగలమన్న సంగతి తమ బోధనలలో భగవాన్ తెలిపారు.

ఈ విషయాన్ని శ్రీ గణపతి మునికి భగవాన్ ఇచ్చిన ఉపదేశం క్షుణ్ణంగా తెలుపుతోంది: 'నేను' భావన ఎక్కడి నుండి ఉద్భవిస్తోందన్న విషయాన్ని గమనిస్తే మనసు అందులో లీనమవుతుంది. అదే తపస్సు. ఒక మంత్రాన్ని మరీ మరీ జపిస్తూ, ఆ మంత్రం యొక్క శబ్దం ఎక్కడి నుండి ఉద్భవిస్తోందన్న మూలాన్ని గమనిస్తే మనసు అందులో లీనమవుతుంది. అదే 'తపస్సు'. ఈ ఉపదేశం ద్వారా భగవాన్ తపస్సు యొక్క మూలమును అన్వేషించాలని, ఆ మార్గమే అనుకూలమైనదని, తెలిపారు.

మరొక భాషణలో భగవాన్ ఇలా తెలియజెప్పారు. యాంత్రికంగా శ్వాసను అదుపు చేయడం ద్వారా లక్ష్యాన్ని చేరలేము. ఆ ప్రక్రియ ఒక సాధనంగా మాత్రం పనిచేయగలదు. అలా చేస్తున్నప్పుడు కూడ మనసు జాగృతంగా వుండేలాగ శ్రద్ధ తీసుకుని 'నేను-ధ్యాస'ను దృష్టిలో వుంచుకుంటూ దాని మూలాన్ని అన్వేషించాలి. ఎక్కడ శ్వాస లీనమవుతుందో అక్కడ ''నేను-ధ్యాస'' ఉదయిస్తుంది. అవి రెండు ఒకే సమయంలో అంతమవుతాయి, ఉదయిస్తాయి. శ్వాసతోబాటు 'నేను-ధ్యాస' కూడ అంతమవుతుంది. అప్పుడే ఒక అనంతమైన ''నేను-నేను' అన్న భావన స్ఫూర్తిస్తుంది. అది ఆగకుండ సాగుతుంది. మనం ఆశించే లక్ష్యం అదే. ఆ స్థితిని - దేవుడు, ఆత్మ, కుండలినీశక్తి,

చైతన్యము, యోగం, భక్తి, జ్ఞానం మొదలైన పలు పేర్లతో పిలుస్తారు. (టాక్స్ 195)

"నేను-భావన" లేదా జపం, లేదా శ్వాస యొక్క ఉనికి ఎక్కడ వుందన్న దానిని తీవ్రంగా పరిశీలించాలన్న బోధన చాలా అద్భుత మైనది, సాధకులకు పలువిధాల ఉపయోగపడేది కూడ. అలా మూలాన్ని గమనించినప్పుడు ఆశ్చర్యకరమైనది జరుగుతుంది. సాధకుడు తాను అప్పటి వరకు ఆచరిస్తున్న మార్గాన్ని అనుసరిస్తూనే, ఆత్మ అన్వేషణలో పడతాడు. దీనినే భగవాన్ "సూటియైన మార్గ" మంటారు.

మూలాన్ని గమనించడం ఎలాగ అన్న ప్రశ్న ఉదయించవచ్చు. అందుకు మూలం ఎక్కడ వుందన్నది తెలుసుకోవాలి. ఆత్మ అనే ఆ మూలం ఎప్పుడూ నిలకడగా వుంటుంది, మార్పులకు లోను కాదు. మనం మెలకువగా వున్నప్పుడు తల నిలకడగా వుంటుంది, నిద్రలో తలవాలుతుంది. అంటే అది మూలం కాదు. అలాగే చేతులు, కాళ్ళు మొండెం నుండి వేరు చేయబడినప్పటికి కూడ మనిషి బ్రతికే వుంటాడు. హృదయం (అంటే, కేంద్రం) మూలం అని భగవాన్ చెప్పి నప్పటికీ, ఆ భావన అనుభవం లోనికి వచ్చి అది భౌతికమైనది కాదన్న అనుభూతి కలిగే వరకు అది ఒక భావనగా మాత్రమే మిగిలి పోతుంది. మూలం లోపల లేదు, బయటా లేదు, ఎందుకంటే అలాంటి ఆలోచన శరీరాన్ని పరిగణనలోనికి తీసుకుంటుంది. కాని ప్రాథమికంగా మనం అది శరీరంలో ఎక్కడో వుంటుందని అనుకోవచ్చు. ఎవరికి వారే ఆ మూలం ఎక్కడ వుందన్న దాన్ని గుర్తుంచుకోవాలి. తాము ముందుగా భావించిన దానినే దృష్టిలో పెట్టుకొనరాదు. ఇక్కడ గమనించేవారు, గమనించ బడేది, రంగం లోనికి వస్తారు. అంటే ఇందులో మనసు

ప్రమేయం వుందన్నమాట. ఆత్మ అన్వేషణలో ప్రతిసారి ఒక ఆలోచన ఉదయిస్తుంది, శోధన జరిపితే అది అంతర్ధానమవుతుంది. ఆ ఆలోచన తాత్కాలికమే అయినదని, సత్తా లేనిదని ఋజువై దానికి ఉనికి లేదని బట్ట బయలవుతుంది. మరైతే మూలం ఎక్కడ వుంది? ఈ విషయంలో భగవాన్ మనకు ఒక ఉపయోగకరమైన మర్మాన్ని తెలుపుతారు. ఆత్మ అన్వేషణలో మనం 'నేను ఆలోచన' యొక్క మూలాన్ని గమనించి అందులో లీనం కావాలి. ఈ ప్రక్రియలో మన సహజ అనుభవం కారణంగా శ్వాసపై ధ్యాస పెరుగుతుంది. ఇది అందుకే మనకు పరిచయమైన, ఆచరణీయమైన పద్ధతి అవుతుంది. మూలాన్ని గమనిస్తూ వుంటే శ్వాస క్రమంగా తగ్గుతున్నట్లు మనకు తెలుస్తుంది.

ఆత్మాన్వేషణలో నిమగ్నం కావడం మిక్కిలి అద్భుతమైన అనుభూతిగా ఏర్పడుతుంది. ఏది అతి సన్నిహితంగా వుందో దాన్ని మనం అన్వేషిస్తున్నాము కాని అందుకు మనం తగిన మర్మాన్ని తెలుసుకొనవలసి వుంటుంది. స్పష్టంగా వున్నదని మనం భావించేదే మఱుగైనట్లు అనుభవం కలుగుతుంది. ఆత్మను అన్వేషించడంలో ఇది ఒక విపరీతమైన పరిస్థితి. అందుకే ఆత్మ అన్వేషణను ముందుగానే ఏర్పరుచుకొన్న కల్పన, భావనతో మొదలుపెట్టరాదు. ఆలోచనా రహితమైన మనసు, నిశ్చలమైన మనసు అన్నది వ్యక్తికి ఒక అరుదైన అనుభూతి కావచ్చు, కాని భగవాన్ సూచించిన మార్గం దానిని సాధ్యమయ్యేలాగ చేస్తుంది.

*(సశేషం)*

# సిద్ధులు, వారి "సిద్ధు"లు

('మౌంటెన్‌పాత్', ఏప్రిల్-జూన్ 2015, (52 సంపుటి, 2 సంచిక)లో 'కీ వర్డ్' శీర్షికతో ప్రచురింపబడిన వ్యాసం 'సిద్ధ-సిద్ధి' నుండి ఎన్నుకొనబడిన భాగాల యొక్క అనువాదం) ఆంగ్లమూలం: డా॥ జాన్ గ్రైమ్స్

తెలుగు అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

సంస్కృత మూలపదం "సిధ్" (సాధించడం, పొందడం) నుండి "సిద్ధ" రూపొందింది. దాన్ని రెండు విధాలుగా వాడుతారు. సాధించిన వ్యక్తి, సాధువు, పరిపూర్ణుడు, జ్ఞాని, ముక్తుడు అన్న అర్థాలలో వాడడం ఒకటి. ఇక రెండవది కొన్ని అద్భుత శక్తులు ("సిద్ధు"లను) ప్రదర్శించ గల వ్యక్తి అనే అర్థంలో వాడడం. భగవాన్ రమణ ఈ రెండు అర్థాలలో కూడ ఈ పదాన్ని ఉపయోగించారు.

భగవాన్ ఈ సందర్భంలో రెండు రకాలైన సిద్ధులను గురించి చెప్పారు. "మంత్రాల ద్వారా గాని, అతీత గుణాలను కలిగిన మందులు, మూలికల వాడకం ద్వారాగాని, లేదా కఠినమైన నియమాలను పాటిం చడం ద్వారాగాని, కొన్ని శక్తులను సంపాదించుకోవచ్చు. కాని ఈ శక్తులు ఆత్మజ్ఞానానికి దోహదపడేవి కావు. ఇక రెండవ రకం ఆత్మను సాక్షాత్కరింపజేసుకున్నప్పుడు సహజసిద్ధంగా వ్యక్తికి లభించే జ్ఞానసంబంధిత మైన మరికొన్ని తరహా శక్తులు. అవి వాటంతట అవే లభిస్తాయి. అవి దైవ ప్రసాదితాలు".

సిద్ధపురుషుడు "సిద్ధు"లను పొందడం లేదా పొందకపోవడమన్నది విధి విలాసంపై ఆధారపడి వుంటుందని మహర్షి అప్పుడప్పుడు అనేవారు. జ్ఞాని అతీత శక్తులను గురించి పట్టించుకోడు. సిద్ధులు ఆత్మ నిష్ఠతో సహజ సమాధిలో ప్రతిష్ఠితులై, ఆ చైతన్యమే తిరుగులేని, స్థిరమైన 'సిద్ధి'గా భావిస్తారు. శ్రీరామకృష్ణ, అంతకంటే పూర్వుల లాగ శ్రీరమణులు కూడ అద్భుతశక్తుల వల్ల ఉపయోగమేమీ వుండదని

అన్నారు. నిజమైన సాధకునికి ఆత్మాన్వేషణపై తప్ప మానవాతీత శక్తులను పొందాలన్న దానిపై ధ్యాస వుండరాదు.

"ఇంద్రియాల ప్రత్యక్ష ప్రమేయం లేకుండ దూరంలో వున్నవారి మధ్య భావ అనుభూతుల ప్రసారం (టెలిపతీ) లేదా రేడియో లాంటి మాధ్యమాల ద్వారా అక్కడి శబ్దాలను వినడం, లేదా ఘటనలను చూడడం, సాధ్యం కావచ్చు. దగ్గర లేదా దూరం అన్నదానితో సంబంధం లేకుండ వినడంలోనైతే తేడా వుండదు. ఇక్కడ మౌలికమైన విషయ మేమిటంటే వినేవాడు లేదా చూసేవాడు లేనప్పుడు వినడం, చూడడం జరగదు. ఈ రెండూ (వినడం, చూడడం) మనసు యొక్క క్రియలు. అతీతశక్తులు ("సిద్ధ"లు) అన్నవి మనసులో ఏర్పడినవి మాత్రమే. అవి చైతన్యానికి సహజమైనవి కావు. ఏవి సహజం కావో, ఏవి ఇతర విధాల సాధించబడినవో అవి శాశ్వతమైనవి కావు. వాటి కోసం వెంపర్లాడడం తగనిది. అది నిస్సారము, నిరర్థకమైనది.

"మాయాజాలం, సహజాతీత శక్తులు, ఎవరినీ సంతోషపరచలేవు, నిజానికి వ్యక్తికి మరింత దుఃఖాన్ని కలిగిస్తాయి. అంతేగాకుండ అలాంటి శక్తులు ఎవరి కోసం? అతీతశక్తులను సంపాదించిన వ్యక్తి వాటి ప్రదర్శనతో ఇతరుల మెప్పు పొందడానికి ఇష్టపడతాడు. మెప్పుదల కోరుకుంటాడు, అది లభించకపోతే సంతోషపడడు. మెచ్చుకొనబడాలి అన్నప్పుడు 'ఇతరులు' వుండాలి. మరొక విషయం. అలాంటి శక్తులను తనకంటే ఎక్కువగా కలిగినవారు ఎదురు కావచ్చు కూడ. అలాంటి పరిస్థితి అసంతుష్టికి దారితీస్తుంది. వారికంటే ఎక్కువ, వారి కంటే కూడ ఇంకా ఎక్కువ శక్తులు కలిగినవారు తారసపడవచ్చు. ఇలా దానికి అంతు వుండదు. అసంతృప్తి కలుగుతుంది. అందరి కంటే అన్నిటికంటే అధిక శక్తి గల సిద్ధుడు దేవుడు, లేదా ఆత్మ మాత్రమే.

అసలు నిజమైన శక్తి ఏది? సంపదను అభివృద్ధి చెందించేదా? శాంతిని ప్రసాదించేదా? శాంతిని ప్రసాదించేదే మిక్కిలి ఉత్తమమైన సిద్ధి.''

ఒక కోణం నుండి పరిశీలించినప్పుడు ఇది నిజమే. కాని మరొక దృక్పథం నుండి కూడ చూడాల్సిన అవసరం వుంది. గణపతిముని సంకలనం చేసిన ''శ్రీరమణ గీత''లో భగవాన్ ''సిద్ధపురుషుల యొక్క ఘనత ఊహకు అందనిది. వారు శివునితో సమానం. నిజంగా చెప్పాలంటే వారు శివరూపాలే! ప్రతి కోరికను, ప్రార్థనను తీర్చగల శక్తి వారికి వుంది'' అని అన్నట్లు వుంది.

అరుణాచలం కొండ యొక్క స్వంతదారు ఎవరు? అన్న దానిని గురించి నడచిన ఒక సర్కారు వ్యాజ్యం సందర్భంలో కోర్టులో శ్రీరమణులు ఇలా చెప్పారు: ''శివుడు ఎప్పుడూ మూడు రూపాలను ప్రదర్శిస్తాడు - ఒకటి పరాబ్రహ్మ రూపం, మరొకటి లింగరూపం, మూడవది సిద్ధరూపం''. శ్రీ అరుణాచల మహాత్మ్యంలో శివుడు ''యధార్థానికి నేను జాజ్వల్యమైన అగ్నిరూపిని. కాని ఇక్కడ మందంగా కాంతివిహీనమై ఈ కొండ (అరుణగిరి) రూపాన్ని కృపతో ఈ ప్రపంచం మనుగడ కోసం ధరించాను. ఇక్కడ ఒక సిద్ధుడి రూపంలో వున్నాను'' అని ప్రకటించుకున్నారు.

సిద్ధునికి, జ్ఞానికి, భేదమేమిటని ఒక భక్తుడు ప్రశ్నించినప్పుడు రమణ మహర్షి ఇలా విశదీకరించారు: ''(రమణ)గీత''లో పేర్కొనబడిన ప్రశ్నలు ఒక ఉద్దేశ్యంతో అడగబడ్డాయి. జవాబులు కూడ వాటికి తగ్గట్లు ఇవ్వబడ్డాయి. జనం శరీరాన్ని మాత్రం దృష్టిలో పెట్టుకుని ''సిద్ధు''లు (శక్తులు) కూడ కావాలని కోరుకుంటారు. ''సిద్ధు''ల కోసం ఆతృత చెందేవారు జ్ఞానంతో తృప్తి చెందరు. దానికి జతగా ''సిద్ధు''లు కూడ లభించాలంటారు. జ్ఞానం ప్రసాదించే అత్యుత్తమ ఆనందాన్ని అసలు లెక్క చేయకుండ ''సిద్ధు''ల కోసం అర్రులు జాస్తారు. అలాంటి

ప్రయత్నంలో రాజమార్గాన్ని వదలి సందుల వెంబడి పడిపోవడంతో అసలు దోవ తప్పిపోతారు. అలాంటి వారికి సరియైన మార్గదర్శనం చేసి మళ్ళీ రాజమార్గంలో వుంచడం కోసం (అంటే జ్ఞానం యొక్క ఉత్కృష్టతను తెలపడం కోసం) ''సిద్ధ''లు జ్ఞానాన్ని అంటిపెట్టుకుని వుంటాయని చెబుతారు. నిజానికి జ్ఞానం అన్నింటిని ఆవరించిన సంపూర్ణమైన స్థితి. అందుకే జ్ఞాని ఇతర శక్తులను గురించిన వ్యర్థమైన ఆలోచనే చేయడు. జ్ఞానాన్ని ఆర్జించడంపై ముందు పరిశ్రమ చేస్తే ఆ తరువాత కావాలనుకుంటే ''సిద్ధ''ల గురించి ఆలోచించవచ్చు''.

''శరీర సమాశ్రయః సిద్ధియాః (సహజాతీత శక్తులు శరీరానికి సంబంధించినవి) అని నేను అన్నాను. ఎందుకంటే వాటిని వాంఛించే వారి దృక్పథం, వైఖరి, శరీరానికి సంబంధించినవి. జ్ఞాని, సిద్ధ పురుషుడు, వేర్వేరు కారు. 'వరాన్ దాతుమ్' (వరాలను ఇవ్వడం) అనడంలో ఆ వరాలలో 'ఆత్మ' లాభం కూడ చేరివున్నట్లే. 'సిద్ధ'లు ఏవో హీనశ్రేణికి చెందినవి మాత్రమే కావు. ఉన్నతమైనవి కూడ (వున్నాయి)''.

''సిద్ధుడు'' అనే పదం శ్రీరమణుల నిర్వచనంలో ఎల్లప్పుడూ సహజ సమాధిలో సుస్థిరంగా నెలకొని వుండే ముక్తుడు, వివేకి అని కూడ అన్వయించబడింది. ''శరీరం అశాశ్వతం, సత్యమైనది కాదు. అది నిలకడగా ఒక చోట వున్నా, లేదా చలిస్తున్నా, లేదా ప్రారబ్ధవశాత్తు తన నుండి రాలిపోయినా, ఆత్మజ్ఞానియైన సిద్ధుడికి ఆ విషయం ఎఱుకలోకి రాదు. పరిస్థితి బాగా మద్యం సేవించి స్పృహలో లేని వాడికి తన వంటి మీద గుడ్డ వుందా లేదా తెలియని స్థితి లాగ వుంటుంది.

*(సశేషం)*

## Everything Belongs to God

(Dr.K.Subrahmanian, Talk 74A)

Everybody says this is my book, this is my son, this is my wife and so on. What it means is that there is a special relation between what is mentioned and you. However, when we think about it deeply, we are astonished how false the whole thing is. Because we are so used to saying it, we don't think of the implications of saying it. For example, when I say my son- do I own him the way I own a pen or a pencil? Even a pen or a pencil, when stolen by someone, becomes somebody else's. The pencil is not going to say that I belong to a particular person, don't take me away. But the extraordinary thing is, in human relationship also, we do not own anybody. 'My' wife means that there is a special relationship between me and a particular woman. But I do not own her. Strictly speaking, nobody has any control over another person. But we think that we have. And that is the reason why much of the time we are unhappy. We don't own our children; children only pass through us. They are individuals by themselves. If they are attached to us for certain reason, it does not mean that we have control over them. And so, we do not own anybody or have control over anyone.

All our lives we try to control other people, either with the help of money or power and so on. We all fail miserably. Leave alone controlling others, do I have control over myself? When I say myself, mostly we mean 'my' body. The extraordinary thing is, this body is given to us and we can't say we made any effort to possess it. We have no control over our body. When somebody touches me, even if I do not like it, I cannot avoid the sensation of being touched. Then I realize that I don't have control over my body, something else has control over my body. In the same way, I have no control over my mind also; it functions in its own

way, prompted by so many things. The entity I call myself ends up doing many things under the control of my mind and my body.

When I have no control over myself, it will be very difficult to have control over anyone else or 'possess' anything. There is no constancy in possessing anything, be it name, fame, money and so on. And the paradox is we all admire and even worship not those who have plenty of this and that, but those who have given up everything. We are prepared to do anything for those who are not seeking anything because we get a peace which we don't get from people of prominence. This is the paradox: the man who has immense money or power, goes to somebody who has none of these. People who are not interested in possessing anything seem to have something that we are unconsciously seeking. They don't want anything but everybody is prepared to give anything that they may ask for the simple reason that they don't ask! Can we truly enjoy anything by seeking to possess it?

Gandhiji used to say, 'Even if I forget everything else I have studied but remember this one *sloka* I wouldn't worry because that would carry me through the rest of my life. And that sloka is the first sloka of Isavasya Upanishad.

**ईशावास्यमिदं सर्वं यत्किञ्च जगत्यां जगत् ।**
**तेनत्यक्तेन भुञ्जीथा मा गृधः कस्यस्वित् धनम् ॥**

*IsavasyamIdagm sarvam, yatkincha jagatyam jagat;*
*tenatyaktena bhunjeetha ma gridhah kasyasvit dhanam*

This is a very simple sloka but also very difficult to follow. It is not a matter for discussion but a matter of experience. This sloka says, everything, every particle in this universe is pervaded by God; and this universe can be enjoyed through renunciation, and so, do not covet or seek other people's *dhana* or wealth.

Bhagavan also affirms that everything in this universe is pervaded by God, saying **अष्ट मूर्ति भृत् देव पूजनम्** (*Ashtamurti-*

